నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల కారణంగా కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ షాపూర్‌నగర్ ఈఎస్ఆర్ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

సుభాష్‌నగర్, సూరారంలో..

సుభాష్‌నగర్, సూరారం ప్రాంతాల్లో శుక్రవారం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భగత్‌సింగ్‌నగర్, సూరారంలో..

భగత్‌సింగ్ నగర్, సూరారంలోని కాలనీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

చింతల్, జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ల పరిధిలో...

జగద్గిరిగుట్ట: చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, రంగానగర్, దుర్గానగర్, చంద్రానగర్, శివానగర్, చింతల్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాధాకిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

- జగద్గిరిగుట్ట, సంజయ్‌పూరికాలనీ, దేవమ్మ బస్తీ, పాపిరెడ్డినగర్, బీరప్పనగర్, సోమయ్యనగర్, మగ్దూంనగర్, మైసమ్మనగర్, అంజయ్యనగర్, షిరిడీహిల్స్, రింగ్‌బస్తీ, రాజీవ్‌హిల్స్, శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్, భూదేవిహిల్స్‌లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

కేవీఆర్, భౌరంపేట్, కేఎస్ఆర్ ఫీడర్ల పరిధిలో...

నిజాంపేట్: రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ విద్యుత్ ఏఈ సాయి కిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. కేవీఆర్, భౌరంపేట్ ఫీడర్ల పరిధిలోని శంభీపూర్, మహేశ్వరం, ప్రణీత్ బ్లూమ్స్, ప్రణీత్ మిడోవ్స్, ల్యాండ్ మార్క్ 1,2, కీర్తిహోమ్స్, సుకృతి హోమ్, భౌరంపేట్ పార్ట్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- కేఎస్ఆర్ ఫీడర్ పరిధిలోని డీమార్ట్ ఏరియా, కేఎస్ఆర్‌కాలనీ, బెవర్లీ పామ్స్, వెంకటసాయి ఎన్‌క్లేవ్, బాటాషోరూమ్, ఈశ్వర్ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ ఏఈ తెలిపారు.

చింతల్: విద్యుత్ మరమ్మతులు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బోయిన్‌పల్లి డివిజనల్ ఇంజినీర్ భిక్షపతి సూచనల మేరకు సెంట్రల్ బ్రేక్ డౌన్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. బోయిన్‌పల్లి సంచార్‌పురి, క్యాబ్‌సన్స్ ఫీడర్ల పరిధిలోని సంచార్‌పురి కాలనీ, పబ్లిక్ సెక్టార్ కాలనీ, ఉమానగర్, ప్రశాంత్‌నగర్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. అదే విధంగా రిలయన్స్ విల్లా, బాలానగర్ శివాలయ ఫీడర్ల పరిధిలోని ఐడీపీఎల్ ఎస్ఎస్, బాలానగర్, శివాలయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: వార్షిక మెయింటెన్స్ నేపథ్యంలో చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కుత్బుల్లాపూర్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. సూర్యానగర్ ఫీడర్ పరిధిలోని సూర్యానగర్, రామిరెడ్డినగర్, పాపయ్యయాదవ్‌నగర్, పద్మానగర్‌ఫేజ్-1, గణేష్ నగర్ ఫీడర్ పరిధిలోని గణేష్‌నగర్, జనహిత ఆస్పత్రి, షా థియేటర్ వెనుక గల్లీ, ద్వారకానగర్ ఫీడర్ పరిధిలోని దీనగర్, ద్వారకానగర్, ప్రసూననగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మేడ్చల్ జోన్ డీసీపీగా నితిక పంత్

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జోన్ డీసీపీగా నితిక పంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శబరీష్ ములుగు జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ డీసీపీగా ఉన్న నితిక పంత్ ఇక్కడికి వచ్చారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌పై దుకాణాలు పెట్టొద్దు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట నుంచి గాంధీనగర్ వరకు గురువారం బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తున్న వ్యాపారులను డబ్బాలను తొలగించాలన్నారు. అదే విధంగా ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన వాహనాదారులను హెచ్చరించారు. ఇలా చేయడం వలన నిత్యం తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మరోసారి ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట్: అక్రమ నిర్మాణాలపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపించారు. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప సమీపంలోని సర్వే నం.191లో బస్టాండ్ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి ప్రశాంతి నేతృత్వంలో సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుమతులు లేని నిర్మాణాలను ఉపేక్షించేది లేదన్నారు. ఎంతటి వారైనా ప్రభుత్వం పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో కైట్ ఫెస్టివల్

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో గురువారం కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన కేం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే, కళాశాల ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి పతంగులను ఎగురవేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ రాధికాదేవి, వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడి అరెస్టు

జీడిమెట్ల: బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన అమర్‌నాథ్(35) చింతల్‌లోని ఓ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 9.30గంటలకు చింతల్ కల్పనా సొసైటీకి చెందిన బాలిక (13) ఇంటి సమీపంలో ఆడుకుంటున్న క్రమంలో అమర్‌నాథ్ బాలిక వద్దకు వెళ్లి చాక్లెట్ ఇప్పిస్తానని ఆశచూపాడు. టెంట్‌హౌస్ సామాన్లు ఉంచే గోడౌన్ వద్దకు తీసుకెళ్లి బాలికపై అత్యాచారాని యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో వదిలేసి పారిపోయాడు. ఇంటికి వచ్చిన బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం పరారీలో ఉన్న నిందితుడు అమర్‌నాథ్‌ను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు.

స్క్రాప్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



మంటలను అర్పుతున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: విద్యుత్‌వైర్లు తెగిపడటంతో ఓ స్క్రాప్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఫైర్ అధికారి సుభాష్ రెడ్డి వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఎస్వీ కోఆపరేటీవ్ సొసైటీ ఫేజ్-1లో పేరులేని ఓ స్క్రాప్ గోదాం ఉంది. గురువారం ఉదయం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుని మంటలు వెలువడ్డాయి. గమనించిన స్థానికులు జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. అగ్నిప్రమాదానికి కారణం విద్యుత్‌వైర్లు తెగిపడటమేనని అధికారులు ధ్రువీకరించారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు



చంటిబిడ్డతో వచ్చి ముగ్గు వేస్తున్న మహిళ

రంగురంగుల ముగ్గులు

సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు రంగు రంగుల రంగవల్లులు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ వెంకటేశ్వర్ నగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో గురువారం 'సాక్షి'ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్కూల్ వాతావరణం మొత్తం రంగులతో నిండిపోయింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగిన ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు తమదైన శైలిలో ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. సంక్రాంతి పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశంయాదవ్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. - కుత్బుల్లాపూర్





'సాక్షి', సత్‌జ్ఞాన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు

ముగ్గులతో పోటీలతో సంక్రాంతికి శ్రీకారం చుట్టారు: ట్రాఫిక్ ఏసీపీ

ముఖ్యఅతిథిగా హాజరైన బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ... 'సాక్షి'ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం సంక్రాంతి వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు అయిందని సంతోషం వ్యక్తం చేశారు. రోడ్లపై నడిచే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో సెల్ ఫోన్లు మాట్లాడకుండా వెళ్లాలని సూచించారు. చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని పలు సూచనలు చేశారు.

విజేతలు వీరే..

ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు శ్రీలక్ష్మికి ప్రథమ బహుమతి అందజేయగా బి. సుస్మితకు స్కూల్ ఇన్‌చార్జ్ రత్నకుమారి రెండో బహుమతి ప్రదానం చేశారు. అదే విధంగా మూడో బహుమతిని మహేశ్వరికి స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం యాదవ్ అందజేశారు. కన్సోలేషన్ బహుమతులను స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ మానస్‌కుమార్ చేతుల మీదుగా కె.రమాదేవికి బహూకరించారు. అదేవిధంగా పాఠశాల అధ్యక్షురాలు విజయలక్ష్మి జి.సరళకు పట్టు చీరలను అందజేశారు. మొత్తం 117 మంది ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేశారు.

'సాక్షి'కి రుణపడి ఉంటాం..



'సాక్షి'భవిష్యత్‌లో చేపట్టే ఏ కార్యక్రమానికైనా తమ స్కూల్ నుంచి సహకారం ఉంటుందన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసే విషయంలో మాకు తోడ్పాటు అందించిన 'సాక్షి' యాజమాన్యానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని సమాచారం ఇవ్వగానే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయిలో ప్రజలు వచ్చి సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొనడం సంతోషం కలిగింది.

– చింతల మల్లేశంయాదవ్, కరస్పాండెంట్ సత్‌జ్ఞాన్ స్కూల్



మహేశ్వరికి తృతీయ బహుమతి అందజేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశంయాదవ్



సుస్మితకు ద్వితీయ బహుమతి అందజేస్తున్న స్కూల్ ఇన్‌చార్జ్ రత్నకుమారి



శ్రీలక్ష్మికి మొదటి బహుమతి అందజేస్తున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, చిత్రంలో చింతల మల్లేశం యాదవ్



సరళకు కన్సోలేషన్ బహుమతి అందజేస్తున్న స్కూల్ చైర్మన్ విజయలక్ష్మి



రమాదేవికి కన్సోలేషన్ బహుమతిని అందజేస్తున్న ఏడీ మానస్ యాదవ్











విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలి



కుత్బుల్లాపూర్: సుచిత్ర సర్కిల్ సమీపంలోని లయోలా డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రాన్సిస్ జేవీయర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ.. తాము ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలన్నారు. భవిష్యత్ ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా లయోలా కళాశాల విద్యార్థులు ఎదగాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంఏ జోసెఫ్‌కుమార్, డీన్ డాక్టర్ రాచల్ శాలినీ, హెచ్‌ఓడీ లావణ్యకుమారి, కో.ఆర్డినేటర్ సౌజన్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



కుత్బుల్లాపూర్: ప్రజల ఆశయాలను అనుగుణంగా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞతయాత్రలో భాగంగా గురువారం యాత్రలో సుభాష్ నగర్ డివిజన్ పరిధి జేకేనగర్, కృష్ణమూర్తినగర్, భాగ్యలక్ష్మికాలనీ, సుభాష్‌నగర్ ఫేజ్-1, సుభాష్‌నగర్ లాస్ట్ బస్‌స్టాప్, వెంకటాద్రినగర్‌లలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... హ్యాట్రిక్ విజయాన్ని అందించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, ఫిషరీస్ కో-ఆపరేటివ్ మేడ్చల్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ రంగారావు, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, గుబ్బల లక్ష్మీనారాయణ, బలరాంరెడ్డి, బిజిలి సాంబయ్య, శ్రీనివాస్‌గౌడ్, శివాజీ, శ్రీనివాస్ రాజు, ప్రకాష్, కుంటి మల్లేష్, అరుణ, సరిపల్లి పద్మజ, పద్మలత తదితరులు ఉన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు



జగద్గిరిగుట్ట: సైరా నర్సింహారెడ్డి సైన్యంలో సైన్యాధిపతిగా ఆంగ్లేయులతో పోరాడి వీర మరణం పొందిన వడ్డె ఓబన్న జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు స్థానిక కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు ఎర్ర లక్ష్మయ్య, ఇరగదిండ్ల వెంకటేశ్, గిరిబాబు, హనుమయ్య, మంజుల, మూకయ్య, సిద్దయ్య, తిమ్మయ్య పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

సుభాష్‌నగర్: మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కృషికాలనీకి చెందిన రాచకొండ భాగ్య(60) ఈనెల 9వ తేదీ ఉదయం 8గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. గతంలో ఇదే మాదిరిగి వెళ్లిన ఆమె తిరిగి రావడంతో మళ్లీ వస్తుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆమె జాడ తెలియరాలేదు. భాగ్యకు మతి స్థిమితం సరిగా లేదని తెలిపారు. గురువారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

జీడిమెట్ల: గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభించిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అంజనేయులు వివరాల ప్రకారం.. గాజులరామారం యూఎంసీసీ ఆస్పత్రి సమీపంలోని ఓ నీటి కుంటలో మహిళ మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానికుల సహాయంలో బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతురాలి వయస్సు 30-35 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సరోజిని (ఫైల్)

జీడిమెట్ల: ఆస్పత్రికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన సరోజిని(80) బుధవారం ఉదయం 10గంటల సమయంలో వైద్యం కోసం షాపూర్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు సరోజిని కోసం వెతకగా ఆమె జాడ తెలియలేదు. దీంతో సరోజిని కుమారుడు తులసీరాం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపూరణి చిత్రాన్ని వెంటనే నిలిపివేయాలి



సుభాష్‌నగర్: సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తున్న బ్రాహ్మణులను కించపరిచేలా తీసిన అన్నపూరణి చిత్రాన్ని వెంటనే నిలిపివేయాలని శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. గురువారం అన్నపూరణి చిత్ర ప్రదర్శనను నిలిపివేయడంతో పాటు యూనిట్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామయ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగనున్న తరుణంలో శ్రీరామచంద్రుడి ఖ్యాతిని తగ్గించే విధంగా, బ్రాహ్మణులను కించపరుస్తూ లవ్ జిహాదిని ప్రోత్సహించే విధంగా ఈ చిత్రాన్ని రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలనచిత్రాలు వినోదాత్మకంగా ఉండాలే తప్ప వివాదాస్పదంగా మారకూడదనినారు. ఎవరి మనోభావాలు దెబ్బతినేలా చిత్రాలు తీయొద్దని హితవు పలికారు. సంఘం ప్రధాన కార్యదర్శి నిట్టల వెంకటవీరభద్ర సుబ్రహ్మణ్యం, పరశురామ శర్మ, రాజేందర్ పిళ్లై, పరశురామ శర్మ, గడ్డం రాంబాబు, శంకరశర్మ, శ్రీధరాచార్యులు, హరిరాఘవేంద్ర, గణేష్, కొట్టి రవి, సంజీవరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యువజన దినోత్సవం



సుభాష్‌నగర్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సూరారం జిల్లా పరిషత్ పాఠశాలలో యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ సలహాదారు, మాజీ ప్రిన్సిపాల్ విజయగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తక పఠన చేయాలన్నారు. మేధావులు, గురువులు ఇచ్చిన సూచనలు పాటించాలన్నారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ సభ్యుడు, సామాజిక వేత్త కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఇష్టంతో చదివితే ఏదీ అసాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం జావిద్, ఉపాధ్యాయులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



నిజాంపేట్: ఎంఓహెచ్‌యూఏ విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ - 2023 జాబితాలో తెలంగాణ రాష్ట్రానికి నాలుగు అవార్డులు వచ్చాయి. అందులో నిజాంపేట్ కార్పొరేషన్ ఒకటిగా నిలిచింది. గురువారం ఢిల్లీ ప్రగతిమైదాన్‌లోని ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి చేతుల మీదుగా నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణరావులు సర్వ సర్వేక్షన్-2023 అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ... నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండోసారి జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో రాబోయే కాలంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా, మోడ్రన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తామన్నారు.